క్లుప్తంగా

24 గంటలు వైద్యం అందించే ఆసుపత్రులివే..

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో ..

మెడికేర్ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్	88852 62138
శ్రీకర ఆస్పత్రి	040 4747 0000
ప్రణామ్ ఆస్పత్రి	040 2304 2777
హీలెక్స్ ఆస్పత్రి	040 4200 7070
లక్ష్మి చిల్డ్రెన్ ఆస్పత్రి	040 2303 9733
అంకుర చిల్డ్రన్ ఆస్పత్రి	040 4939 9999
ఉద్భవ ఆస్పత్రి	040 6782 0172
సిదార్థ ఆస్పత్రి	79933 33301

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 130, పచ్చిమిర్చి 90, బెండ 40, కాకర 50, దొండ 25, దోస 30, ఆలు 25, చామ 45, కీర 25, బీర 50, వంకాయ 40, గోకర 40, బీన్స్ 110, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 70, ఉల్లి 100 (4 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30 సొరకాయ (కేజీ) 30, అల్లం 300, వెల్లుల్లి 220.

సెల్లార్ తవ్వకంపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడలో అవంతిక ఎన్‌క్లేవ్‌లో చేపట్టిన సెల్లార్ తవ్వకంపై శనివారం కాలనీవాసులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ తవ్వకాలను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కాలనీవాసులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని అన్ని రక్షణ చర్యలు తక్షణమే తీసుకోవాలని బిల్డర్‌కు సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం 08 మందికి కొవిడ్ టెస్టులు నిర్వహించగా అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 07 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

నృత్యార్చన



మాదాపూర్: అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శనివారం సూయషా అత్తులూరి ఒడిస్సీ నృత్య ప్రదర్శన అలరించింది. వీణ, నటువాంగం ,మృదంగం, మురళీ వాయిద్యాలతో స్తాహి అనే ఒడిస్సీ నృత్యాన్ని ప్రదర్శించింది. శిరుత నవ్వుల వాడ సిన్నెక, విష్ణువు దశావతారాలను ప్రదర్శించారు. అనంతరం జ్ఞాపికలతో సత్కరించారు.

ప్రశాంతంగా జేఎన్‌వీ ప్రవేశ పరీక్ష

- మూడు సెంటర్లలో నిర్వహణ



గచ్చిబౌలిలో జేఎన్‌వీ ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

గచ్చిబౌలి: జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డిజిల్లా స్కూల్‌లో 11వ తరగతిలో ప్రవేశం కోసం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జెడ్పీహెచ్‌ఎస్ లింగంపల్లి, జెడ్పీహెచ్‌ఎస్ కొండాపూర్, జెడ్పీహెచ్‌ఎస్ గచ్చిబౌలి కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. కాగా ప్రవేశ పరీక్ష నిర్వహణ తీరును, పరీక్షా కేంద్రాలను నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ టి గోపాలకృష్ణ, జేఎన్‌వి ప్రిన్సిపల్ డి విజయభాస్కర్, ప్రవేశ పరీక్ష ఇన్‌చార్జ్ కె మట్టయ్య పరిశీలించారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్త రిమాండ్

మియాపూర్: అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు గురి చేసి భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తను మియాపూర్ పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మియాపూర్‌లోని రెడ్డి కాలనీలో నివాసముంటున్న కోనేటి భరత్, భార్య సౌజన్య వరకట్న వేధింపులు తాళలేక గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకొంది. ఇందుకు కారణమైన భరత్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆఖరి మజిలీకి ఆధునిక వసతులు

ఖాజాగూడలో 3 ఎకరాల్లో రూ.3 కోట్ల వ్యయంతో మినీ వైకుంఠ మహాప్రస్థానం



ఖాజాగూడలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడలో మినీ మహాప్రస్థానం ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు .దేశంలోనే అత్యున్నత ప్రమాణాలు, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన వైకుంఠ మహాప్రస్థానం రాయదుర్గంలో ఉంది. అలాగే ఖాజాగూడలో ఇటీవల శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబాతో కలిసి శంకుస్థాపన చేశారు. దీన్ని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులో తీసుకొచ్చేలా అధికార యంత్రాంగం స్థలాన్ని చదును చేసే పనులు చేపట్టారు. ఈ పనులను శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి ఏఈ జగదీష్, ఆధ్వర్యంలో వర్క్ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పర్యవేక్షణలో జరుగుతున్నాయి.

- రూ. 3 కోట్ల వ్యయంతో మినీ మోడల్ శ్మశాన వాటిక నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ నిర్ణయం
- మహాప్రస్థానం నిర్మాణ పనులకు జూలై 10న శంకుస్థాపన
- నగరంలోని మినీ వైకుంఠ మహాప్రస్థానాల్లో మోడల్‌గా నిర్మాణం
- గ్రీనరీకి అత్యంత ప్రాధాన్యత.. ఫుట్‌పాత్‌లు, సిట్టింగ్ బెంచీల ఏర్పాటు
- బోరు, కుళాయిలు ఏర్పాటు.. బర్నింగ్ ఫ్లాట్‌ఫారమ్‌లు, టాయిలెట్ల నిర్మాణం
- చుట్టూరా ప్రహరీ నిర్మాణం, లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు.

దశలవారీగా అభివృద్ధి



గచ్చిబౌలి డివిజన్‌లోని అన్ని శ్మశానవాటికల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తాం. కుటుంబంలోని వ్యక్తిని కోల్పోయిన వారు శ్మశానవాటికకు వస్తే మంచి వాతావరణం ఉండేలా చూస్తాం.

– కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, గచ్చిబౌలి

సౌకర్యాల కల్పన దిశగా..



గచ్చిబౌలి డివిజన్‌లోని శ్మశానవాటికల్లో సౌకర్యాలు కల్పించేలా ప్రతిపాదనలు చేశాం. ఖాజాగూడలో మినీ మహాప్రస్థానం కోసం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చేస్తాం.

–మాజీ కార్పొరేటర్ సాయిబాబా, గచ్చిబౌలి

అండర్‌బ్రిడ్జి.. మూడోరోజు రాకపోకలు బంద్



శేరిలింగంపల్లి: వర్షాలకు లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి కింద వరదనీరు చేరిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శనివారం కూడా రాకపోకలు నిలిచిపోయాయి. కురుస్తున్న వర్షాలకు భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. మసీద్‌బండ మీదుగా వచ్చే వరద గోపీచెరువు, చాకలి చెరువు మీదుగా రైల్వే అండర్ బ్రిడ్జి కిందికి చేరడంతో భారీగా వరద నీరు నిలిచింది. అండర్ బ్రిడ్జి కింద చేరిన బురదను తొలగిస్తే గానీ రాకపోకలు సాగుతాయి. ఖైల్ చౌరస్తా నుంచి తారానగర్ మీదుగా వచ్చే వాహనాలను, గచ్చిబౌలి నుంచి తారానగర్ మీదుగా ఖైల్ చౌరస్తా వైపు వచ్చే వాహనాలను నల్లగండ్ల రైల్ ఓవర్ బ్రిడ్జి మీదుగా మళ్లించడంతో వాహనాదారులకు ఇబ్బందిగా మారింది.

'స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వండి'

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్‌లో ఇంటి స్థలం ఉన్న అర్హులకు ఇళ్ళు కట్టుకోవడానికి ఐదు లక్షలు ఇవ్వాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులతో శనివారం జీహెచ్‌ఎంసీ డిప్యూటి కమిషనర్ సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ...బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో స్థలం ఉన్న వారికి ఇళ్లు కట్టుకునేందుకు ఐదు లక్షలు ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి కొన్ని ఇళ్లు కూలిపోయే దశకు చేరుకున్నాయని వారిని ఆదుకోవాలన్నారు.అదేవిధంగా ఇటీవలే సీఎం కేసీఆర్ పటాన్‌చెరు బహిరంగ సభలో డివిజన్‌కు ప్రకటించిన 10 కోట్లతో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, నాయకులు కిషన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నడిగడ్డతండావాసుల నిరసన

మియాపూర్: మణిపూర్ ఘటనలో నేరస్తులకు ఉరిశిక్ష వేయాలని నడిగడ్డతండా అంబేడ్కర్ విగ్రహం వద్ద బస్తీవాసులు శనివారం కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ తుకారాం నాయక్ హాజరై మాట్లాడుతూ మణిపూర్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షులు తిరుపతినాయక్, సీతారాంనాయక్, మురళీ నాయక్, బాలాజీ, జింతు నాయక్, లక్ష్మీ, రీనాబాయ్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శం



ట్రాఫిక్ పోలీసులకు రెయిన్ కోట్లు అందజేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో ట్రాఫిక్ విభాగంలో పని చేస్తున్న పోలీసులకు ముత్తూట్ ఫైనాన్స్ సంస్థ సహకారంతో సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అతి త్వరలో నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న పోలీసులందరికీ రెయిన్ కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ మేనేజర్ యమగాని లక్ష్మీనారాయణ, రీజనల్ అడ్మిన్ మేనేజర్ శ్రీమతి బిందు, సునీత, సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపీ శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హైటెక్స్‌లో స్టైల్ తత్వ ఎగ్జిబిషన్, ఫ్యాషన్‌షో

ప్రారంభించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, అదనపు డీజీపీ శిఖాగోయల్



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ విజయలక్ష్మి, అదనపు డీజీపి శిఖాగోయల్ తదితరులు

మాదాపూర్: భూమాత సంక్షేమం, ప్రజల సంక్షేమం ఇప్పుడు అన్నింటికంటే ముఖ్యమైనదని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఫ్లో స్టైల్ తత్వ ఎగ్జిబిషన్‌ను ఫ్లో జాతీయ అధ్యక్షురాలు సుధాశివకుమార్ ,అదనపు డీజీపి శిఖాగోయల్‌లతో కలసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా వ్యాపారులకు సాధికారత కల్పించడం కోసం ఇది నిర్వహించబడుతుందన్నారు. జీ20లో భాగమైన ఫ్లో రెండు ప్లాట్‌ఫారంలను అందిస్తుందన్నారు. ఒకటి మహిళలకు మార్గదర్శకత్వం, రెండు టెక్ ఈక్విటీ అన్నారు. అదనపు డీజీపి శిఖాగోయల్ మాట్లాడుతూ స్టైల్‌తత్వ అన్నిటికన్నా భిన్నమైనదని కొనియాడారు. ఫ్లో హైదరాబాద్ చైర్‌పర్సన్ రీతూషా మాట్లాడుతూ స్టైల్‌తత్వ అనేది ప్లాస్టిక్ రహిత జీవనశైలి ఫ్యాషన్‌షో అని తెలిపారు. ప్రత్యేకమైన టెక్స్‌టైల్ క్రాఫ్ట్ టెలియా రుమాల్ అంతరించిపోతుందన్నారు. టెలియా రుమాల్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఆర్ట్‌గ్యాలరీలో వేగాన్ ఫెస్టివల్ ప్రారంభం



వేగాన్ ఫెస్టివల్‌లో మాట్లాడుతున్న ఐటీ సెక్రటరీ జయేశ్‌రంజన్

మాదాపూర్: సాత్వికాహారం మానవుని ఆరోగ్యానికి పరమ ఔషధమని తెలంగాణ రాష్ట్ర ఐటీ సెక్రటరీ జయేశ్‌రంజన్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీ ఎంపీసీసీ భవనంలో వేగాన్ ఫెస్టివల్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఫెస్టివల్‌లో మానవునికి కావాల్సిన ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. వేగాన్ ఆహారం యోగా, ఆకుకూరలు,సోయాబీన్స్, పుట్టగొడుగులు ప్రత్యామ్నాయ వృక్ష సంబంధిత పాలు, వాటి ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సీపీఆర్‌ఇఇసీ డైరెక్టర్ డాక్టర్ పి. సుధాకర్ మాట్లాడుతూ బల వర్ధక పోషకాలతో కూడిన పదార్థాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

రెయిన్‌కోట్లు పంపిణీ

రాయదుర్గం: వాతావరణం ఎలా ఉన్నా విధులను నిర్వహించేవారే పోలీసులని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో ఇనార్బిట్ మాల్, రహేజా కార్స్‌లో భాగమైన నిర్మాణ్ సంస్థతో కలిసి సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ విధులను నిర్వహించే 1050 మందికి రెయిన్‌కోట్లను శనివారం సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రహేజా నిర్మాణ్ సంస్థ, ఇనార్బిట్‌మాల్ వారు ముందుకు రావడంను అభినందించారు. కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్, డీసీపీ ట్రాఫిక్–1 హర్షవర్ధన్, డీసీపీ మేడ్చల్ ట్రాఫిక్ డివిశ్రీనివాసరావు,అ దనపు డీసీపీ పి శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీ మాదాపూర్ ట్రాఫిక్ రణవీర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు నర్సయ్య, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనాథ్, నాగిరెడ్డి, రహేజా కార్స్ హెడ్ శ్రావణ్, ఇనార్బిట్ మాల్ సెంటర్ హెడ్ శరత్ బెలవాడి పాల్గొన్నారు.

'మనూ'లో ఐటీఐ అడ్మిషన్ల ప్రక్రియ షురూ

- ఆగష్టు 3న కౌన్సెలింగ్
- దరఖాస్తునకు జూలై 31 చివరి తేదీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఐటీఐ హైదరాబాద్‌లో రెండవ దశ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇండస్ట్రియల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ) హైదరాబాద్‌లో రెండవ దశ అడ్మిషన్లు పొందేందుకు దరఖాస్తు చేసుకోవడానికి జూలై 31 చివరి తేదీ అని వివరించారు. ఐటీఐలోని ట్రేడ్‌లలో డ్రాఫ్ట్‌మెన్, సివిల్, మెకానిక్, రిఫ్రిజేషన్ ఎయిర్ కండిషనింగ్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ప్లంబర్‌వంటి ట్రేడ్‌లలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నామన్నారు. దరఖాస్తును ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఐటీఐ హైదరాబాద్ సెంటర్ నుంచి పొందవచ్చున్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23008428 లేదా సెల్ నెంబర్ 9440692452లో సంప్రదించవచ్చని సూచించారు.

ఆవిష్కరణలతో ముందుకు సాగాలి



బౌల్డర్‌హిల్స్ గోల్ఫ్‌కోర్సులో లెసినియో యాప్, డాట్‌కామ్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి

రాయదుర్గం: టీ20 క్యూబ్ లెసినియో సహకారంతో తెలంగాణ క్రీడాకారుల ప్రతిభను దేశవ్యాప్తంగా చాటాలని మంత్రి సబితాఇంద్రారెడ్డి సూచించారు. గచ్చిబౌలిలోని ఎమ్మార్ ప్రాపర్టీస్‌లోని బౌల్డర్ హిల్స్ గోల్ఫ్‌కోర్సులో లెసినియో యాప్, లెసినియో డాట్‌కామ్‌ను టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ ప్రజ్ఞాన్‌ఓజా, మహిళా క్రికెటర్ సునీతానంద్ తదితరులతో కలిసి ఆమె శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సబిత మాట్లాడుతూ టెక్నాలజీని ఉపయోగించుకొని సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆవిష్కరణలతో ముందుకు సాగి సమాజానికి తోడ్పడాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. మాజీ క్రికెటర్ ప్రజ్ఞాన్‌ఓజా మాట్లాడుతూ క్రీడాకారులకు బంగారు భవిత ఉందన్నారు. ఇలాంటి యాప్‌లు గ్రామీణ క్రీడాకారులకు దోహదం చేస్తాయన్నారు. నిర్వాహకురాలు పి అనూషారెడ్డి మాట్లాడుతూ అందరికీ క్రీడలు, క్రీడాంశాలు అందుబాటులో ఉండేలా ప్రయత్నం చేస్తూ టీ20 క్యూబ్‌ను లిసినియో సహకారంతో ప్రచారం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇఫ్లూ ప్రొఫెసర్, ఓయూ మాజీ డీన్ డాక్టర్ వెంకట్‌రెడ్డి, ఐఐటీ మద్రాస్, జేఎన్‌టీయూ మాజీ డీన్ డాక్టర్ రాజేశం, ఇంగ్లాండ్ బోల్టన్ యూనివర్శిటీ మాజీ డిప్యూటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ కొండల్ రెడ్డి, లెసినియో ముఖ్య సలహాదారు సూర్యప్రకాశ్ రెడ్డి, పుల్లా నర్మదారెడ్డి, కబడ్డీ, బాక్సింగ్, టెన్నిస్ జాతీయ క్రీడాకారులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల నాయకులు విద్యావేత్త మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి రెడ్డి సంక్షేమ సంఘం చేయూత



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న సంఘం సభ్యులు

హఫీజ్‌పేట్ : ఓ నిరుపేద రెడ్డి విద్యార్థి ఉన్నత విద్యకు శేరిలింగంపల్లి రెడ్డి సంక్షేమ సంఘం చేయూతనందించింది. శనివారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లోని రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయంలో సభ్యులు ఆ విద్యార్థికి రూ.35 వేలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో ఆటోడ్రైవర్ కరుణాకర్‌రెడ్డి కుమారుడికి వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజీలో సీటు వచ్చిందని దానికి కావలసిన ఫీజు నిమిత్తం రెడ్డి సంక్షేమ సంఘంను సంప్రదించగా సంఘం అధ్యక్షులు నల్ల సంజీవరెడ్డి, సీనియర్ జర్నలిస్టు, గౌరవ సలహాదారులు గంట్ల రాజిరెడ్డి ఆధ్వర్యంలో సాయం చేశారు. రెడ్డి సంఘం నాయకులు రామచంద్రారెడ్డి, కొండవీటి ప్రభాకర్‌రెడ్డి, తాడూరు గోవర్ధన్‌రెడ్డి, శేరి అంతిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, దుగ్గి రవీందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలకు పెద్దపీట వేయాలి

పరూల్ యూనివర్సిటీ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్‌నాయర్



కార్యక్రమంలో పాల్గొన్న సంతోష్‌నాయర్, ట్రిపుల్‌ఐటీ ప్రొ.రమేశ్‌లోకనాథన్ తదితరులు

మాదాపూర్: ఇంజనీరింగ్ కళాశాలలో నాణ్యతతో పాటు పరిశోధనలకు పెద్దపీట వేయాలని పరుల్ యూనివర్సిటీ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్‌నాయర్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని లెమన్‌ట్రీ హోటల్‌లో శనివారం ఇంజనీరింగ్ కళాశాలల ట్రాన్స్‌ఫార్మింగ్, టెక్‌లో హైస్కిల్డ్ టాలెంట్‌ను సృష్టించడం అనే అంశంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్ రమేశ్‌లోకనాథన్, నరసారావుపేట ఇంజనీరింగ్ కాలేజ్ వైస్‌చైర్మన్ చక్రవర్తి మిట్టపల్లి, బైట్ ఎక్స్‌ఎల్ సీఈఓ కరుణ్ తాడేపల్లి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం ఉద్యోగం, మంచి వేతనం కోసమే కాకుండా ఇంజనీరింగ్ చదవాలని, ఆలోచనలలో మార్పులు రావాలని సూచించారు. పరిశోధనలపై దృష్టిసారించాలని తెలిపారు. నైపుణ్యాన్ని పెంచే విద్య అవసరమని పేర్కొన్నారు. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఎక్కువగా రీసెర్చ్‌వైపు దృష్టిసారిస్తుందని అందుకే కంప్యూటర్‌సైన్స్‌లో టాప్‌లో ఉందని తెలిపారు. కార్యక్రమంలో డీన్‌లు, ప్రిన్సిపాల్‌లు, ఫ్యాకల్టీలు, మేనేజ్‌మెంట్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పరికి చెరువు నాలా

- ప్రతి వర్షాకాలం ఇబ్బందులే ..
- సమస్యను పరిష్కరించాలని స్థానికుల వినతి





ఆల్విన్‌కాలనీలోని పరికి చెరువు నాలా వద్ద ఏపుగా పెరిగిన చెట్లు, పిచ్చిమొక్కలు, పక్కనే నివాస గృహాలు

ఆల్విన్‌కాలనీ: నగరంలో ప్రతి వర్షాకాలం ఏదో ఒక సమస్య ఎదురవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా నాలాలు, కుంటలు, బ్రిడ్జిలపై చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.కానీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని పరికి చెరువు నాలా ఆల్విన్‌కాలనీ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు ప్రవహిస్తూ వుంటుంది. ప్రతి వర్షాకాలంలో పరికి చెరువు నాలాతో స్థానికులు ఇబ్బందులుపడుతూనే ఉన్నారు .గత 4 సంవత్సరాల క్రితం పరికి చెరువు నాలా ఉప్పొంగి ఆల్విన్‌కాలనీ, ధరణినగర్ పరిసర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. కొన్ని నెలల వరకు ముంపు సమస్య తీరలేదు. నాడు అధికారులు హడావుడిగా నాలాకు ఇరువైపులా కంచె గోడలు ఏర్పాటు చేస్తామని 5 కోట్ల వరకు నిధులు వెచ్చించి కొద్ది దూరం వరకు నాలా గోడలను నిర్మించి వదిలేశారు. ఈ నాలాకు ఇరువైపులా అనేక కాలనీలు, బస్తీలు ఉన్నాయి. పిచ్చి మొక్కలు పెరిగిపోయి వరదనీరు సాఫీగా ప్రవహించకుండా అడ్డుపడుతున్నాయి. వర్షాలు కురిసినప్పుడల్లా వరద నీరు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు మొరపెట్టుకుంటున్నారు. చెట్లు కూలిపడుతున్నాయని, పాములు, తేళ్లు, జెర్రిలు వంటి క్రిమికీటకాలు ఇళ్లలోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తుగా నాలాకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని కోరారు. పన్నులు వసూలు చేయటంలో ఉన్న శ్రద్ధ మౌలిక వసతులు కల్పించటంలో లేదని వాపోయారు. ఇక ఆల్విన్‌కాలనీ సాయినగర్‌లో రెన్యూ్యా హోమ్ వద్ద ఏర్పాటు చేసిన బ్రిడ్జిని ఇప్పటి వరకు పూర్తి చేయలేదు.పైగా ఈ బ్రిడ్జిని సగం వరకూ నిర్మించి వదిలివేయటంతో వరద తాకిడికి కొట్టుకుపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రతి వర్షాకాలం ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల సమస్యలు నెలకొంటున్నాయి. పరికి చెరువు నాలాకు ఇరువైపులా కంచెగోడలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. నేటి వరకు నోచుకోలేదు. నాలాలో చెట్లు పెరిగిపోయి కూలిపడుతున్నాయి. విషపురుగులు సంచరిస్తున్నాయి. బ్రిడ్జిలు నిర్మించటంలో చిత్తశుద్ధి లేదు. ప్రజా ప్రతినిధులు అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలి.

–కుమార్ యాదవ్, స్థానికుడు